జీడి మామిడి కుదేలు


కృష్ణాపురంలో చెట్టు చివరన ఉన్న జీడి పిక్క


పద్మనాభంలో కాపు లేని జీడి మామిడి చెట్టు


పద్మనాభంలో చెట్టు చివర ఉన్న జీడి పిక్క

- తేనె మంచుకు దెబ్బతిన్న జీడీ మామిడి కాపు
- పెట్టుబడి రాక జీడి రైతుల ఆవేదన
- ఆర్థికంగా నష్టపోయిన జీడి మామిడి వ్యాపారులు
- ఎకరాకు 5 కిలోలు రాని వైనం

పద్మనాభం: జీడి మామిడి దిగుబడి **పూర్తిగా** దెబ్బతినడంతో రైతులు, వ్యాపారు**లు తీవ్రంగా** నష్టపోయారు. మండలంలో కృష్ణాపు**రం, పద్మనా**భం, కురపలి తదితర గ్రామాలో సుమారు 500 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. డిసెంబర్‌లో పూత, ఫిబ్రవరిలో పిందె దశలో ఉన్న సమయంలో తేనె మంచు దట్టంగా కురువడంతో పూత, పిందె రాలిపోయింది. దీంతో చాలా తోటల్లో నామమాత్రపు దిగుబడి మాత్రమే వచ్చింది. కొన్ని తోటల్లో అయితే ఒక్క జీడి పిక్క కూడా కనిపించలేదు. పూత, పిందె నిలబడటానికి రైతులు ఎకరానికి రెండు విడతలుగా రూ.5 వేలు వెచ్చించి క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. సాధారణంగా ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.60 వేల ఆదాయం వచ్చేది. అయితే, ఈసారి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయారు. తోటల సంరక్షణకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు పూర్తిగా దిగుబడి రాకపోవడంతో వాటిని తీర్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.


జీడి పిక్కలు


కృష్ణాపురంలోని జీడి మామిడి తోట


తోటలో లభ్యమైన కొద్దిపాటి జీడి పిక్కలను ఇంటికి తీసుకువెళుతున్న వ్యాపారి

పూర్తిగా పోయింది



నాకు 40 సెంట్ల జీడి మామిడి తోట ఉంది. పూత కోసం, అది నిలబడటం కోసం మందులు కొట్టాను. దీనికి రూ.2500 ఖర్చయింది. కానీ డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు కురిసిన దట్టమైన తేనె మంచు వల్ల పూత, పిందె మొత్తం రాలిపోయింది. సాధారణంగా రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి తోట పూర్తిగా పోయింది, ఒక్క కాయ కూడా లేదు.

– పి.ఆదినారాయణ, రైతు కృష్ణాపురం

ఐదు కిలోలే దిగుబడి వచ్చింది



నాకు 50 సెంట్ల జీడి మామిడి తోట ఉంది. దీనికి రెండుసార్లు మందులు పిచికారీ చేశాను. ఇందుకోసం రూ.3 వేలు పెట్టుబడి పెట్టాను. సాధారణంగా రెండున్నర క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ మంచు ప్రభావానికి పూత, పిందె దెబ్బతినడంతో కేవలం ఐదు కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. జీడి మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మంచు మా ఆశలను అడియాసలు చేసింది.

– పి.వెంకటరావు, రైతు కృష్ణాపురం

పెట్టుబడి రాలేదు



నేను పద్మనాభంలో ఎకరా జీడి మామిడి తోటను ఫలసాయం కోసం రూ.5 వేలకు కొన్నాను. మరో రూ.5 వేలు పెట్టుబడి పెట్టి మందులు పిచికారీ చేశాను. కానీ ఎకరానికి కేవలం ఐదున్నర కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. దీని ద్వారా నాకు వచ్చింది కేవలం రూ.660. సాధారణంగా ఐదు క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ ఇంత తక్కువ దిగుబడి రావడంతో నేను పూర్తిగా నష్టపోయాను.

– పి.ఆది, వ్యాపారి కృష్ణాపురం

భూతాపం తగ్గించేందుకు చర్యలు

మధురవాడ: భూతాపాన్ని తగ్గించేందుకు వివిధ రకాల చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. మూడో శనివారం సందర్భంగా మధురవాడలోని విద్యుత్ శాఖ కార్యాలయాల కాంప్లెక్స్‌లో ఆయన ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బీట్ ద హీట్' అనే నినాదంతో పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నివాసాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడం ద్వారా వేడిని తగ్గించడమే కాకుండా, సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసి ఆదాయం పొందవచ్చునని దీని గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే మొక్కలు నాటడం, నీటి పొదుపు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా కరపత్రాల పంపిణీ, ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మధురవాడ డీఈఈ టి. కిరణ్‌కుమార్, పెందుర్తి డీఈఈ సీహెచ్ కోటేశ్వరరావు, ఏఏవో రమాదేవి, ఏఈఈలు శైలజ, నిర్మల, భీమిలి, విశాఖ తూర్పు, పెందుర్తి నియోజకవర్గాలు పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఈఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు

హామీలు నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు కూటమి తెర



తగరపువలస: కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా హామీలు నెరవేర్చలేదని, డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి ఆరోపించారు. జరగని విషయాలను దుష్ప్రచారం చేస్తూ, ప్రతి అంశంలోనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టులు దీనికి ఉదాహరణ అని ఆయన అన్నారు. లిక్కర్ స్కామ్ పేరుతో తప్పుడు వాంగ్మూలాలతో లేని స్కామ్‌ను సృష్టిస్తున్నారని, అధికారులపై ఒత్తిడి తెచ్చి అనైతిక అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

ఆరు నెలల్లో ఫుట్ ఓవర్ వంతెన పూర్తి

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలు వద్ద మధురవాడ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని టీడీపీ నాయకుడు గంటా రవితేజ తెలిపారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ, జీవీఎంసీ నిధులు రూ. 3.23 కోట్లతో ఈ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ప్రజలందరికీ ఉపయోగపడేలా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కనకమహాలక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో నీటి కష్టాలు


మారికవలస అన్నా క్యాంటీన్‌లో ఆకులు, వాటర్ బాటిల్‌తో ప్రజలు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలోని అన్న క్యాంటీన్‌లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారింది. శనివారం నీరు అందుబాటులో లేకపోవడంతో, భోజనం కావాలంటే ఆకులు తెచ్చుకోవాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పక్కనే ఉన్న పాన్ షాపులు పేపర్ ప్లేటు ధరను రూ.5–6కు పెంచేశాయి. వాటర్ బాటిల్ ధర అదనం కావడంతో, శనివారం ఇక్కడ భోజనం ఖర్చు రూ.10 దాటిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చిన పేద ప్రజలు అధిక ధరలు చెల్లించి భోజనం చేయాల్సి వచ్చింది. రూ.5 భోజనం అనుకుంటే రెట్టింపు ఖర్చు అయిందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య, విద్యా రంగాల్లో దక్షిణాదిదే బలం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డా. సునీతా తాండల్వాడ్కర్

కొమ్మాది: దక్షిణ భారతదేశం వైద్య, విద్యా రంగాల్లో చాలా బలమైనదని ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (ఫోగ్సీ) అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్ అన్నారు. రుషికొండలో జరిగిన ఫోగ్సీ వేవ్స్ – 2025 సదస్సులో ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది గైనకాలజిస్టులతో పాటు డా. పలనియప్పన్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా. రాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీల ప్రభుపాదుల విజయోత్సవం నేడు



తగరపువలస: ఇస్కాన్ బెంగళూరు భక్తుల 25 ఏళ్ల న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో విజయం లభించిన సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని చైతన్యభవన్‌లో విజయోత్సవం జరుపుకోనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస ఈ విషయాన్ని తెలిపారు. శ్రీల ప్రభుపాదుల వారి విజయోత్సవం పేరుతో ఆయన విగ్రహానికి అభిషేకం, హారతి, కీర్తనలు, మహా ప్రసాదం ఏర్పాటు చేశారు. గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు మధు పండిత్ దాస ఆన్‌లైన్‌లో ప్రసంగిస్తారు. ఇస్కాన్ సంస్థాపకులు శ్రీల ప్రభుపాదులను ఏకైక గురువుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ వేడుక నిర్వహిస్తున్నారు. ఇస్కాన్ బెంగుళూరు 25 ఏళ్లలో దేశంలో 25, విదేశాల్లో 8 మందిరాలు స్థాపించిందని, అక్షయపాత్ర ఫౌండేషన్ కూడా బెంగుళూరు నుంచే ప్రారంభమైందని భక్తదాస తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న భక్తి సంగీతలహరి


షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

తగరపువలస: భీమిలి జోన్ 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం 15వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తి సంగీత కార్యక్రమం జరిగింది. సాయంత్రం జి.మాడుగుల శ్రీపంచముఖ హనుమ భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం ఆశ్రమ ఆవరణలో మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని వ్యవస్థాపకుడు సాయిరామ్ స్వామీజీ తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

భారీ వాహనాలతో అవస్థలు


పద్మనాభం జంక్షన్‌లో తిరగడానికి ఇబ్బంది పడుతున్న భారీ వాహనం

పద్మనాభం: పద్మనాభంలోని ప్రధాన రహదారులపై భారీ వాహనాల రాకపోకలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పద్మనాభం జంక్షన్ మీదుగా పద్మనాభం–మహారాజుపేట, పద్మనాభం–విజయనగరం ఆర్అండ్‌బీ రోడ్లపై భారీ కంటైనర్లు తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జంక్షన్‌లో వీటిని తిప్పడానికి డ్రైవర్లు కష్టపడుతుండటంతో వాహనాలు అడ్డంగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఫలితంగా విజయనగరం, సింహాచలం, తగరపువలస వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై విజయోత్సవ ర్యాలీ


అంబేడ్కరు కూడలిలో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు, విద్యార్థులు, మాజీ సైనికులు

తగరపువలస: పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంతో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కరు కూడలి నుంచి చిట్టివలస వరకు ప్రజాసంఘాలు, మాజీ సైనికులు, కూటమి నాయకులు, విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. భారత్‌మాతాకి జై నినాదాలతో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, మట్టా అప్పల నరసయ్యరెడ్డి, కూటమి నాయకులు గంటా రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మె జూలై 9కి వాయిదా


మాట్లాడుతున్న ఆర్ఎస్ఎన్ మూర్తి

తగరపువలస: ఈ నెల 20న జరగవలసిన పారిశ్రామిక సమ్మెను అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9కి వాయిదా వేసినట్టు సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. శనివారం చిట్టివలస కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అఖిలపక్ష కార్మిక సంఘాలు ఉమ్మడి వేదికగా ఈ నిర్ణయం తీసుకున్నాయని వెల్లడించారు. నాలుగు లేబర్ కోడ్‌లు, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఈ సమ్మె తలపెట్టామని ఆయన పేర్కొన్నారు. సమ్మె తేదీ మార్పును గమనించి వివిధ వర్గాల ప్రజలు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

పీఎంపాలెం : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పీఎంపాలెం సమీపంలోని ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయకూడదని, పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు.

'బీట్ ద హీట్'పై అవగాహన


వెల్లంకిలో మొక్క నాటుతున్న అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి శివారు వైఎస్సార్ కాలనీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జరిగింది. మండల ప్రత్యేక అధికారి సీహెచ్ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'బీట్ ద హీట్'పై అవగాహన కల్పించారు. వేసవిలో ఎండను ఎదుర్కోవడం, పశుపక్ష్యాదులకు నీరు అందించడం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేసవి నుంచి రక్షణ మార్గాలపై అవగాహన

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 'బీట్ ద హీట్' కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి తాపం నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వేడిని ఎదుర్కొనేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి హైడ్రేషన్ డ్రైవ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించడం, చలివేంద్రాల ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంబంధిత పోస్టర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు.

మధురవాడలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు వేర్వేరుగా స్వచ్ఛాంధ్ర–స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞలు, ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ 'బీట్ ద హీట్' నినాదంతో ఎండ వేడిమి నుంచి అందరూ సురక్షితంగా ఉండాలని సూచించారు. ఉదయం 9 గంటల తర్వాత అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని, వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, మెడికల్ ఆఫీసర్ కిషోర్ పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రవి ఆధ్వర్యంలో 'వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్' అనే నినాదంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.